# పాపఫలము

శ్రీమతి బి. లక్ష్మీవెంకాయమ్మగారు

పూర్వము బుందేలు నగరమును క్రూరుడును పరస్త్రీలోలుడును అగు ఉస్మాన్‌జా అను మ్లేచ్ఛుడు పరిపాలించుచుండెను. అతని రాజ్యములో ప్రజలు లేశమైనా సుఖములేక అష్టకష్టము లనుభవించుచుండిరి. సౌందర్యవతులగు స్త్రీలు అతని కంటబడినయెడల వారిని తనవశ మొనర్చుకొనును. ఆ గ్రామములోనున్న రత్నసేట్ అను వైశ్యుని భార్య అసమానసౌందర్యవతియైయుండెను. ఆమె పతినే దైవముగా భావించి పూజించుచు పతివ్రతయై ప్రఖ్యాతిగాంచెను. దేశమంతటను ఆమె రతీదేవిని మించిన చక్కనిదనియు అరుంధతీదేవినిమించిన పతివ్రతయనియు చెప్పుకొనసాగిరి. ఈసంగతి ఉస్మాన్‌జా విని ఆమె నెట్లైనను వశమొనర్చుకొనవలెనని నిశ్చయించెను. పాపకర్ముడగు ఉస్మాన్‌జా స్త్రీవేషము ధరించి రత్నసేట్ యింటికి వెళ్లెను. నవాబుగారి పెద్దబీబీ వచ్చినదని జ్యోతిర్మయీదేవితో చెప్పమని దాసీతో కబురంపెను. పతివ్రతయగు జ్యోతిర్మయీదేవి కపటవేషముతో నున్నబీబీని గౌరవించుటకై వచ్చెను.

ఆమె సౌందర్యము అతని కన్నులకు మిరుమిట్లు గొల్పెను. సోదరీమణులారా, పతివ్రతకు తెలియని దేమున్నది! చూచుటతోనే ఆమె స్త్రీవేషముతోనున్న పురుషుడని గ్రహించెను. ఆమె అతనికి బుద్ధివచ్చునట్లు జేయుదమని తలంచి దాసీకి సౌంజ్ఞ చేసెను. దాసీ సౌంజ్ఞ గ్రహించి రత్నసేట్‌ను తీసుకొనివచ్చెను. రత్నసేట్ జ్యోతిర్మయీదేవివలన జరిగిన సంగతంతయు విని అతనిని స్తంభమునకు కట్టి కొరడాతో బాధింపసాగెను. దెబ్బలకు తాళజాలక అతడు నిజముచెప్పి, రక్షించవలసినదనియు ఇకనుంచి పరస్త్రీలను తల్లులవలె భావించెదననియు ప్రార్థించెను. కరుణామయులగు దంపతులు అతనిని వదలిరి.

రత్నసేట్ యుండగా జ్యోతిర్మయీదేవి తనకు లభించదని తలచి తుచ్ఛుడగు ఉస్మాన్‌జా రహస్యముగా అతనిని చంపెను. ఆశవము నొకపెట్టెలోనుంచి ఆమెకు పంపెను. ఆమె పెట్టెలోనున్న పతి కళేబరమును చూచి మూర్ఛనొందెను. ఆమె ఉన్మాదిని యైపోయెను. నాపతిని చంపినవానిశిరము వారము రోజులలో ఒక పతివ్రతవలన ఖండింపబడును అని శపించెను. ఆమె కళేబరమును శిరసుపై నుంచుకొని అరణ్యసంచారము చేయసాగెను. భూలోకసంచారమునకై వచ్చిన పార్వతీదేవి ఆచిన్నదానినిచూచి జాలినొంది సంగతేమని యడిగెను. జ్యోతిర్మయీదేవి పార్వతీదేవికి సాష్టాంగనమస్కార మాచరించి, తల్లీ, జగజ్జననీ, త్రిలోకేశ్వరీ, మాతా, మహిషాసురమర్దనీ! నా ప్రాణేశ్వరుని బ్రతికించుమని పలువిధముల ప్రార్థించెను. పార్వతీదేవి ప్రసన్నురాలై రత్నసేట్‌ను బ్రతికించెను. దంపతులిరువురును దేవిని పలుతెరంగుల స్తుతించిరి. దేవి సంతసించి అష్టైశ్వర్యములు పుత్రపౌత్రాభివృద్ధి గల్గునటుల దీవించి అదృశ్యమాయెను. దంపతులిరువురును పురము

నకు వచ్చిరి. జనులందరు జ్యోతిర్మయీ దేవి పాతివ్రత్యమును వేతెరంగుల పొగడ సాగిరి. ఉస్మాన్‌జా పద్మగంధియను రాజ పుత్రస్త్రీని మోహించి బలిమింబట్ట సంకింపగా పతివ్రతయగు నామె ఉగ్రురాలై నిశిత కరవాలముతో శిరస్సు ఖండించెను. పాప కర్ముడైన ఉస్మాన్‌జా మరణమునకు జనులందరు సంతసించిరి. సుగుణవంతుడగు రత్నసేట్‌ను ప్రజలందరు కలసి రాజును గావించిరి. జ్యోతిర్మయీ రత్నసేట్‌లు లక్ష్మీనారాయణులవలె విరాజిల్లుచు ధర్మముగా పరిపాలించుచుండిరి.

## మాలాలి

శ్రీమతి రాజేశ్వరి గారు

బంగరుపతంగి యొక్కటి నింగినుండి
వ్రాలినది మా యొడిని భాగ్యవశముచేత
దోమతెరగూటిలో దాచినాము: దానిఁ
జూడ సుంకంబు చెక్కిలి చూరిగొనుటె.

నిదురలోనైన నఁ బిడికిళ్ల వదలకుండ
నేమి దాచిపెట్టెదో కాని మేమెరుగము
భావి భాగ్యమో, ప్రేమ సంజీవనంబొ!
కట్టుకథ రీతిగా మాకు గానుపించు.

కాలికి కాలును కేలికి
కేలును తగులంగనీక కేవల మమృతాం
దోళికపై బవళించిన
మా లాలిని బోల చందమామ యొకండే!

ఒక లేవెన్నెలరేక కన్బొమలపై యుయ్యాలలూగంగ స్వా
ప్నిక మాధుర్యము దోచబోలునుసుమీ నీ లేయెడందన్; కపో
లకళాసీమల చిన్నిగుంటలువడన్ రాణించు చిర్నవ్వు నే
రికగన్ నేర్చితివమ్మ మా యనుగు లాలీ! తెల్పుమీ నాచెవిన్

మురిపించి మబ్బుచాటున
కొరిగి యొరిగి పోవుచుంటి వో జాబిలి! నీ
వరిగిన నరుగుము; మాకీ
మురిపెంపులప్రోవె నిండుపూర్ణిమ యెపుడున్।